
www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 7 మే 2025 | 5 | ఏలూరు



బ్యాక్‌లాగ్ పోస్టులు చూపొద్దన్నారు

డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ
ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

బ్యాక్‌లాగ్ పోస్టులు కోర్టులో ఉండటం వేత 2025 డిఎస్‌సిలో చూపొద్దని ప్రభుత్వం తెలిపిందని డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు. డిఎస్‌సిలో బ్యాక్‌లాగ్ పోస్టులు ఏవీ అనే శీర్షిక బుధవారం ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనంపై ఆమె స్పందించారు. అందుకు సంబంధించిన వివరణ నోట్ రూపంలో ఇచ్చారు. 2014, 2018 స్పెషల్ డిఎస్‌సి 2019లో భర్తీ కాకుండా మిగిలిపోయిన ఉపాధ్యాయ ఖాళీలను లిమిటెడ్ రిక్రూట్‌మెంట్‌లో చూపాల్సిందిగా ఆదేశాలు ఉన్నాయన్నారు. ఈ కారణంగానే 2025 డిఎస్‌సిలో బ్యాక్‌లాగ్ పోస్టులను చూపలేదు. సదరు పోస్టులన్నీ భవిష్యత్తులో జరగబోయే లిమిటెడ్ రిక్రూట్‌మెంట్‌లో కోర్టు ఉత్తర్వులు అనుసరించి భర్తీ చేయనున్నట్లు డిఇఒ తెలిపారు.

పేదలపై యుద్ధం ఆపకపోతే..
ఉద్యమం ఉధృతం..


అభివాదం చేస్తున్న నేతలు

ఇళ్ల తొలగింపు బాధితులకు
పునరావాసంతోపాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి
ఎంతమంది పేదలకు ప్రత్యామ్నాయం చూపారో
బహిరంగ చర్చకు సిద్ధమా
పేదల ఇళ్లు కూల్చడం ఆపితే ముగింపు, లేకపోతే
ఈ సభ నుంచే మరో పోరాటం
సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
శ్వేతపత్రం విడుదల చేయాలి
సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం
కలిసొచ్చే అన్ని పార్టీలూ, సంఘాలను ఐక్యం చేసి
పోరాడతాం
సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

'ఉండి నియోజకవర్గంలో డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు పేదలపై చేస్తున్న యుద్ధాన్ని ఆపాలని, లేనిపక్షంలో పోరాటం మరింత ఉధృతం చేస్తాం.. అన్యాయంగా ఇళ్లు తొలగించిన బాధితులకు పునరావాసం కల్పించడంతోపాటు ఇళ్లను నిర్మించి ఇవ్వాలి. పేదలపై ఇంతటి దౌర్జన్యం జరుగుతున్నా సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ స్పందించకపోవడం సిగ్గుచేటు. వారు తక్షణం జోక్యం చేసుకుని పేదలపై జరుగుతున్న యుద్ధాన్ని ఆపాలి. లేనిపక్షంలో పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి. అందరికీ ప్రత్యామ్నాయం చూపాకే ఇళ్లు తొలగిస్తున్నామని రఘురామకృష్ణరాజు చెబుతున్నారు, ఎంతమందికి ప్రత్యామ్నాయం చూపించారో బహిరంగ చర్చకు రావాలి'.. ఇవీ ఉండి నియోజకవర్గంలో పేదల ఇళ్ల తొలగింపు బాధితులు, వారికి ప్రత్యామ్నాయం చూపాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్న నేతల మాటలు.

స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభకు ఆకివీడు, పాలకోడేరు, ఉండి మండలాల నుంచి పేదలు పెద్దసంఖ్యలో తరలొచ్చారు. ముఖ్యఅతిథి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒక గౌరవ స్థానంలో ఉన్న డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు పేదల ఇళ్లు కూలుస్తున్నానని బహిరంగంగా ప్రకటిస్తుంటే సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. చట్టాన్ని ఉల్లంఘించి పేదల ఇళ్లను కూల్చే అధికారులు భవిష్యత్‌లో చట్టప్రకారం శిక్షార్హులన్నారు. మగ పోలీసులే మహిళలను ఇష్టానుసారంగా లాగడం సిగ్గుచేటన్నారు. విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పేరుతో ఉన్న నగర్‌లో ఇళ్లు కూల్చిన ఎంఎల్‌ఎ ఇప్పుడు అల్లూరి స్వగ్రామం మోగల్లులో కూడా పేదల ఇళ్లపై దౌర్జన్యానికి శ్రీకారం చుడుతున్నారని మండిపడ్డారు. కాలుష్యానికి కారణాలు ఏమిటో ముందు పరిశీలించాలన్నారు. ఇప్పటికైనా పేదల ఇళ్ల కూల్చివేతను ఆపితే ఇది ముగింపు సభ అవుతుందని, లేదంటే ఇదే ఉద్యమ ప్రారంభ సభగా మారుతుందని హెచ్చరించారు. ఈ సభకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు ఆహ్వానం పలకగా, జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ వందన సమర్పణ చేశారు. ప్రజానాట్యమండలి కళాకారులు చైతన్య ప్రసాద్, షేక్ వలీ గీతాలను ఆలపించారు. ఈ సభలో సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు మంతెన సీతారాం, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి దండు శ్రీనివాసరాజు, ఎంసిపిఐ(యు) జిల్లా నాయకులు రాంబాబు, సిపిఎం నేతలు పుగాకు పూర్ణ, దూసి కళ్యాణి, కె.క్రాంతిబాబు, కె.తవిటినాయుడు, శేషు, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహామూర్తి పాల్గొన్నారు.

ఇళ్లు కూల్చడమేనా మీ అభివృద్ధి

ఉండి నియోజకవర్గంలో ఇళ్లు కూల్చడమేనా మీ అభివృద్ధి అని పివి.రావు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు గుమ్మాపు సూర్యవరప్రసాద్, ఎపి బహుజన జెఎసి ఫౌండర్, ఛైర్మన్ తాళ్లూరి మధు, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజు, బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనా జోసెఫ్ ప్రశ్నించారు. బడా బాబుల చేతుల్లో ఉన్న భూములను స్వాధీనం చేసుకోగలరా అని నిలదీశారు. పేదలకు అండగా ఉండాల్సిన అధికారులు ఎంఎల్‌ఎకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై రఘురామకృష్ణరాజు వ్యాఖ్యలు సరికావని, తక్షణం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో పేదలకు అండగా సిపిఎం సాగించే పోరాటంలో భాగస్వాములమవుతామని ప్రకటించారు.

శ్వేతపత్రం విడుదల చేయాలి.. ★★★
సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం

ఇళ్ల కూల్చివేతపై ఉండి ఎంఎల్‌ఎ చెప్పేవన్నీ అవాస్తవాలే అన్నారు. జిఒ 23 ప్రకారం పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని ప్రభుత్వం చెప్పిందన్నారు. జిల్లాలో కాలుష్యానికి కారణాలు పరిశ్రమలు తప్ప పేదల ఇళ్లు కాదన్నారు. 65 చోట్ల శాంపిల్స్ తీసి పరిశ్రమల వల్లే కాలుష్యం అవుతుందని పరిశోధకులు నిర్ధారించారని, అవసరమైతే ఆ రిపోర్టులు చదవాలన్నారు. పేదల ఇళ్ల తొలగింపు కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, భూస్వాములకు దోచిపెట్టడానికే తప్ప అభివృద్ధికి కాదన్నారు. ఇదొక వ్యాపారంగా ప్రజలు చర్చించుకుంటున్నారన్నారు. ముందు నియోజకవర్గంలో శిథిలావస్థలో ఉన్న వంతెనలు నిర్మించాలన్నారు. పెద్దల చేతుల్లో ఉన్న కొబ్బరి చెట్లు పేదలకు పంచాలన్నారు. ఎఎస్‌ఆర్ నగర్‌లో 1.75 ఎకరాల్లో పేదల నివాసాలు ఉంటే సుమారు 17 ఎకరాలు బడా భూస్వాములు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఉండిలో పి-4 అంతా రివర్స్‌లో ఉందని ఆరోపించారు. టిడిపి, జనసేన నాయకులు కూడా తమకు ఎటువంటి గౌరవమూ ఇవ్వట్లేదని, గుర్తించలేదని బాధపడుతున్నారని చెప్పారు.

ఐక్య పోరాటానికి కలిసి రావాలి.. ★★★
సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన ఒకలా ఉంటే, ఉండి నియోజకవర్గంలో పాలన మరోలా ఉందని గోపాలన్ అన్నారు. ఉండి ఎంఎల్‌ఎ రఘురామకృష్ణరాజు అభివృద్ధి పేరుతో పేదలపై యుద్ధం చేస్తున్నారని మండిపడ్డారు. ఏడు నెలలుగా సిపిఎం పేదల పక్షాన అలుపెరగని పోరాటం చేస్తుందని చెప్పారు. పేదలపై యుద్ధాన్ని ఆపాలని కోరారు. రెండు వారాల నుంచి ఎఎస్‌ఆర్ నగర్‌లో బాధితులు శిథిలాల మధ్యే జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటి నుంచి సిపిఎం భోజనశాల ఏర్పాటు చేసి బాధిత నిర్వాసితులకు భోజనం పెడుతుందన్నారు. సమస్య పరిష్కారమయ్యేంత వరకు భోజనశాలను కొనసాగిస్తామని చెప్పారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకుని శిథిలాల మధ్య బాధితులు, సిపిఎం నేతలు బుధవారం ఒకరోజు నిరాహార దీక్ష చేస్తారని ప్రకటించారు. దీనికి సంఘీభావంగా అంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు.

పేదలకు పునరావాసం కల్పించాలి.. ★★★
సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

గోదావరి జలాలు ఏ విధంగా కలుషితమవుతున్నాయో అనేక మంది ప్రముఖులు చెబుతున్నారు. పేదలకు అండగా నిలిచిన నాయకులను తూలనాడటం అన్యాయం. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై ఎంఎల్‌ఎ రఘురామకృష్ణరాజు వ్యాఖ్యలను సిపిఐ ఖండిస్తుంది. పేదల పక్షాన ప్రశ్నిస్తే భయభ్రాంతులకు గురిచేస్తారా అని నిలదీశారు. ప్రాణాలు పోయినా, కేసులు బనాయించినా వెనక్కి తగ్గేది లేదు. తక్షణం పేదలకు పునరావాసం కల్పించాలి.

ప్రజాప్రతినిధి అంటే అర్థం తెలియని వాళ్లు.. ★★★
కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పాతపాటి హరికుమార్‌రాజు

ప్రజాప్రతినిధులు అంటే ఏమిటో అర్థం తెలియని వాళ్ళు కూడా ఎంఎల్‌ఎ కావడం బాధాకరం. ప్రజల సొమ్మునే జీతాలుగా తీసుకుంటూ ప్రజలనే నష్టపరచడం సమంజసం కాదు. ఎంపీగా గెలిచాక ఢిల్లీలో ఉండిపోయిన రఘురామకృష్ణరాజుకు ప్రజల ఇబ్బందులు ఏం తెలుస్తాయి. ఎంఎల్‌ఎ మంచి బుద్ధితో పేద ప్రజలకు ఇళ్లు కట్టించి ఇవ్వాలి.

నిద్రమత్తులో అధికారులు.. ★★★
మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్

ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు వేసుకున్న పేదలకు పట్టాలివ్వాలని చట్టాలు చెబుతున్నాయనే విషయం మీకు తెలీదా. రఘురామకృష్ణరాజు ఉండి నియోజకవర్గంలో టెన్ వన్ అడంగల్ ప్రకారం సర్వే చేయించి పెద్దలు, భూస్వాములు, పెత్తందారులు, సంపన్నుల చేతుల్లో ఉన్న భూముల లెక్కలు తీయగలరా. డబ్బులిచ్చి ఓట్లు కొని గెలిచానని రఘురామకృష్ణరాజు బహిరంగంగా చెబుతుంటే అధికారులు నిద్రపోతున్నారు. తక్షణం దీనిపై చర్యలు తీసుకోవాలి. పేదలకు న్యాయం చేయాలి.

పేదల ఇళ్లను కూల్చడం దారుణం.. ★★★
బిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి ఎం.రత్నరాజు

ఉండి నియోజకవర్గంలో పేదల ఇళ్లను అభివృద్ధి పేరుతో కూల్చడం అత్యంత దారుణం. పేదలకు మళ్లీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలి. సమస్యలు పరిష్కారం కావాలంటే పోరాటం వల్లనే సాధ్యం. రాబోయే రోజుల్లో సిపిఎం చేపట్టబోయే పోరాటాలకు మా మద్దతు ఉంటుంది.

బుల్డోజర్ రాజకీయాన్ని ఆపాలి.. ★★★
దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్

పేదలపై బుల్డోజర్ల రాజకీయాన్ని వెంటనే ఆపాలి. పేదలపై జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడుతాం. ఎస్‌సి, ఎస్‌టి, బిసిలపై దాడులు నరేంద్ర మోడీ, అమిత్‌షాలకు కన్పించవు. పేదల ఇళ్లు కూల్చేవారే కన్పిస్తారు. పేదలపై జరుగుతున్న విధ్వంసాన్ని ఆపకపోతే రఘురామకృష్ణరాజు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

ప్రమాదాల నివారణకు కార్యాచరణ ప్రణాళిక

- జాతీయ రహదారిపై అనధికార దాబా, హోటళ్లను నియంత్రించాలి
- అనుమతి లేని ప్రదేశాల్లో వాహనాలు నిలపకుండా నిరంతరం నిఘా
- జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశంలో అధికారులకు మంత్రి పార్థసారధి దిశా నిర్దేశం


మాట్లాడుతున్న మంత్రి పార్థసారధి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జాతీయ రహదారిపై ప్రమాదాలకు గల కారణాలను విశ్లేషించి, వాటి నియంత్రణకు వెంటనే అధికారులు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశపు హాలులో మంగళవారం జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, ఎంఎల్‌ఎలు బడేటి రాధాకృష్ణయ్య, చింతమనేని ప్రభాకర్, కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్‌లతో కలిసి అధికారులతో ప్రమాదాల నివారణపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ జిల్లాలో ముఖ్యంగా జాతీయ రహదారిపై ప్రమాదాల కారణంగా ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని, ఇది చాలా బాధాకరమని అన్నారు. ఏలూరు జిల్లాను రోడ్డు ప్రమాదాలరహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ కలిసి రావాలన్నారు. జాతీయ రహదారిపై అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన దాబాలు, హోటళ్లు, అనుమతి లేని ప్రదేశాల్లో భారీ వాహనాల పార్కింగ్, వాహనాల అతివేగం తదితర కారణాలతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని, వీటిని నియంత్రించడం ద్వారా ప్రమాదాలను నివారించేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని అన్నారు. హైవే పెట్రోలింగ్ నిరంతరం ఉండాలని, రాత్రి సమయాల్లో ఎక్కువగా ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్న ప్రదేశాల్లో ఎక్కువ లైటింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కలపర్రు నుండి గుండుగొలను వరకు జాతీయ రహదారిపై సర్వీస్ రోడ్లు లేని ప్రదేశాలలో సర్వీస్ రోడ్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జాతీయ రహదారుల అధికారులను మంత్రి ఆదేశించారు. జిల్లాస్థాయితోపాటు నియోజకవర్గస్థాయిలో భద్రతా కమిటీ సమావేశాలు నిర్వహించాలని, అదేవిధంగా రహదారి భద్రత, హెల్మెట్ ధారణ తదితర భద్రతా అంశాలపై ప్రతి కళాశాలలో మండలస్థాయిలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పలు ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయించామన్నారు. సీతంపేట సమీపంలోని కొత్తగూడెం వద్ద, గుండుగొలను సమీపంలోని కొమిరేపల్లి వద్ద పాఠశాల విద్యార్థుల ఉపయోగార్థం ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు మంజూరు చేయించినట్లు చెప్పారు. దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ జాతీయ రహదారిపై కొన్ని ప్రదేశాల్లో రోడ్లు ఎగుడు, దిగుడుగా ఉండి వేగంగా వెళ్లే వాహనం కంట్రోల్ కాకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. జాతీయ రహదారిపై నూజివీడుకు వెళ్లే సర్వీస్ రోడ్డుకు అప్రోచ్ రోడ్డు నిర్మించాలని, అక్కడ ఆర్‌టిసి రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలని కోరారు. జాతీయ రహదారికి దగ్గరలోని కన్వెన్షన్ సెంటర్ వారు వారి వ్యర్థాలను హైవేపై వేస్తున్నారని, అటువంటి వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. జాతీయ రహదారి డివైడర్‌పై గార్డెనింగ్‌ని కాంట్రాక్టర్లు సక్రమంగా నిర్వహించడం లేదని, వాటిని దగ్గరలో గ్రామ పంచాయతీలకు అప్పగిస్తే పచ్చదనం చక్కగా ఉండి, ప్రమాదాల నివారణకు అవకాశం ఉంటుందన్నారు. ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ ఏలూరు మినీ బైపాస్‌లోని కళ్యాణ మండపాలు, కన్వెన్షన్ సెంటర్ల నిర్వాహకులు వ్యర్థాలను రోడ్డుపై వేస్తున్న కారణంగా మినీ బైపాస్ రోడ్డు అంతా అపారిశుధ్య పరిస్థితులు నెలకొంటున్నాయని, వ్యర్థాలను రోడ్లపై వేసే వారిపై కేసులు నమోదు చేయాలని అన్నారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశాలు ప్రతినెలా నిర్వహిస్తున్నామని, సమావేశంలో జిల్లాలో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తున్నామన్నారు. జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువగా ప్రమాదాలు సంభవించే 33 బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించామని, అక్కడ ప్రమాద హెచ్చరికగా సోలార్ బ్లింకర్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశంలో డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, రవాణా శాఖ ఉప కమిషనర్ కరీం, జాతీయ రహదారుల సంస్థ అధికారులు, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేతన బకాయిల విడుదల కోరుతూ..
20న ఉపాధి పనులు బంద్
ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న రవి

ప్రజాశక్తి - పెదపాడు

గ్రామీణ ఉపాధి హామీ కూలీలందరూ ఈ నెల 20న ఉపాధి పనులు బంద్ చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి పిలుపునిచ్చారు. మంగళవారం పెదపాడు మండలం నాయుడుగూడెం, ఖాజీగూడెం గ్రామాల్లో ఉపాధి పనులు జరుగుతున్న గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీల వేతనాలను సకాలంలో విడుదల చేయాలని కోరారు. గత ఆర్థిక సంవత్సరం వేతన బకాయిలు ఆరు వారాలవి విడుదల చేయకపోవడం దుర్మార్గమన్నారు. చట్టప్రకారం వారం రోజులకు ఒకసారి వేతనాలు ఇస్తామని చెప్పడం తప్ప నెలలు తరబడి పెండింగ్‌లో పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వాలు చెప్పే దానికి, చేసే దానికి పొంతన లేకుండా ఉందని ఎద్దేవా చేశారు. ఇప్పటికే రెండు నెలలుగా కూలీలకు వేతనాలు రాక ఒకపక్క అప్పు చేస్తూ కుటుంబాలను గడుపుతున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకపక్క ఉపాధి కూలీలకు వేతనాలు పెంచామని ఆర్భాటంగా ప్రచారం చేస్తోందని, పెంచింది రూ.ఏడు అయితే ఏదో వందలు, వేలల్లో పెంచినట్లు ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. మరోపక్క కేంద్ర ప్రభుత్వం ఎడమ చేతిలో తీసి కుడి చేతిలో పెట్టినట్లు కూలీలకు రూ.7 పెంచి పేదలకు అవసరమైన గ్యాస్ సిలిండర్ ధర మాత్రం రూ.50నే పెంచారని ఆవేదన వ్యక్తం చేశారు. దీన్నిబట్టి పేదలు, వ్యవసాయ కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలా వ్యవహరిస్తున్నాయో స్పష్టంగా అర్థమవుతుందన్నారు. ఉపాధి కూలీలకు విడుదల చేయాల్సిన వేతనాలను విడుదల చేయకపోగా ధరలు పెంచుతుంటే పేదలు ఏవిధంగా బతకాలని ప్రశ్నించారు. ఉపాధి హామీ పని ప్రదేశాల్లో టెంట్లు, తాగునీరు, మజ్జిగ, పనిముట్లు, మేట్లకు రూ.5 పారితోషకం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించట్లేదని విమర్శించారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20న దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మికుల ఆధ్వర్యంలో ఉపాధి పనులు బంద్ చేస్తామన్నారు. కార్యక్రమంలో వ్యకాస జిల్లా నేతలు ఎస్‌కె.కరీముల్లా, ఉపాధి కూలీలు, మేట్లు, వ్యవసాయ కార్మికులు, పేదలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఉంగుటూరు: ఉపాధి కూలీలకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ మే 20న దేశవ్యాప్త బంద్‌లో పాల్గొనాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ పిలుపునిచ్చారు. ఉంగుటూరులో మంగళవారం ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడారు. ప్రతి కూలీకి ఏడాదికి 200 రోజులు పని కల్పించి, రోజుకి రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

టార్గెట్ పూర్తయ్యిందని ధాన్యం కొనడం లేదు

గోనె సంచుల కొరత తీవ్రంగా ఉంది
ధాన్యం కొనుగోలు చేయకపోతే ప్రభుత్వానికి అప్రతిష్ట
సమీక్షా సమావేశంలో ఎంఎల్‌ఎల స్పష్టీకరణ
పశ్చిమలో లక్ష మెట్రిక్ టన్నులు, ఏలూరు జిల్లాలో 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు అనుమతి
రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - భీమవరం

'ఈ ఏడాది పంట బాగా పండింది. ధాన్యాన్ని తొలుత బాగానే కొనుగోలు చేశారు. డబ్బులు కూడా 24 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఇదంతా ధాన్యం కొనుగోలు ప్రారంభంలో పరిస్థితి. అయితే రైతులు అకాల వర్షాలతో క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు టార్గెట్లు పూర్తయ్యాయని ధాన్యం కొనుగోలు చేయడం కుదరదని చెప్పడం ఎంతవరకు సమంజసం. గోనె సంచుల కొరత కూడా తీవ్రంగా వేధిస్తుంది' అని జిల్లాకు చెందిన పలువురు ఎంఎల్‌ఎలు రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ ఎదుట ఏకరువు పెట్టారు. స్థానిక కలెక్టరేట్లో ధాన్యం కొనుగోలు, సమస్యలపై ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధికారుల సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన వివరాలను రెండు జిల్లాల జాయింట్ కలెక్టర్లు టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, పి.ధాత్రిరెడ్డి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలులో ఏర్పడిన సమస్యలను రైస్‌మిల్లర్స్ అసోసియేషన్, ఎంఎల్‌ఎలు వివరించారు. తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ఒక మండలంలో రైతుసేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు టార్గెట్ పూర్తయిందని, ధాన్యాన్ని కొనుగోలు చేయబోమని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ధాన్యం సొమ్ము కొంచెం ఆలస్యమైనా పర్వాలేదని, ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేయాలని కోరారు. భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ ఊహించని రీతిలో ధాన్యం పండిందన్నారు. టార్గెట్ పూర్తయిందని చెప్పడం సరికాదని, దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. అదనంగా లక్షా 75 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ తమ ప్రాంతంలో 21 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని, అయితే గోనె సంచుల కొరత తీవ్రంగా ఉందని చెప్పారు. ధాన్యం కొనుగోలుకు టార్గెట్ గ్రామాలవారీ కాకుండా మండలాలవారీ తీసుకోవాలని చెప్పారు. సబ్సిడీపై టార్పాలిన్లు అందించాలన్నారు. దీనిపై స్పందించిన మంత్రి మనోహర్ శాఖల వారీగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. పశ్చిమగోదావరి సివిల్ సప్లయిస్ డిఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుసేవా కేంద్రాల ద్వారా సమీక్షించారా, జెసికి ధాన్యం కొనుగోలు నివేదికను ఎప్పుడిచ్చారు.. తనకు ఒక కాపీ ఇవ్వాలని ప్రశ్నించారు.

50 లక్షల గోనె సంచులకు లెక్కాపత్రం లేదు
రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సామంతపూడి శ్రీరామరాజు

జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌తోపాటు అధికారులు చెప్పిన ప్రతిదీ తూచ తప్పకుండా చేస్తున్నాం. ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు టార్గెట్ ఇచ్చారు. ఆ విధంగానే గోనె సంచులు ఇచ్చాం. అదనంగా మరో లక్ష సంచులు ఇచ్చాం. గత సాగులో 50 లక్షల సంచులు తీసుకున్నారు. వాటికి ఇప్పటివరకు లెక్కాపత్రం లేదు. ఇప్పుడు మళ్లీ అదనంగా 30 లక్షల సంచులు కావాలంటున్నారు. ఇవ్వడానికి మేము సిద్ధమే. ఎగుమతి లేక ధాన్యం కొనడం లేదు. ఎంత ధాన్యం కొనుగోలు చేయమన్నా చేయడానికి రైస్‌మిల్లర్స్ సిద్ధంగా ఉన్నారు. అయితే ఎగుమతులు అవసరం. ఈ సీజన్లో పండించిన వెరైటీలకు డిమాండ్ తక్కువగా ఉంది. అందువల్ల వీటిని కొనుగోలు చేసేందుకు సమస్యలు ఏర్పడుతున్నాయి.


49 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు
రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

గత వైసిపి ప్రభుత్వం రైతులను కుంభకోణాలకు, రాజకీయ లబ్ధికి వినియోగించుకుందని, కూటమి ప్రభుత్వం రైతుల కోసం ఎంతో పారదర్శకంగా పని చేస్తుందని మంత్రి మనోహర్ చెప్పారు. అధికారులతో సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడారు. రబీ, ఖరీఫ్‌ల్లో రాష్ట్రంలో 48.90 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. రూ.11 వేల 400 కోట్లు 24 గంటల్లో రైతులు బ్యాంకు ఖాతాల్లో జమ చేశామన్నారు. తాము గత ప్రభుత్వం కంటే 11 లక్షల మెట్రిక్ టన్నులు అదనంగా సేకరించామన్నారు. వైసిపి ప్రభుత్వం రైతులకు చెల్లించాల్సిన రూ.1574 కోట్లు తమ ప్రభుత్వమే అధికారంలోకి వచ్చిన తర్వాత చెల్లించిందన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో 7.50 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. దీనికి తగ్గట్టుగా ఐదు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.1180 కోట్లు రైతులకు జమ చేశామన్నారు. ఏలూరు జిల్లాలో 3.53 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేయగా, 2.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రైతుల ఖాతాల్లో రూ.487 కోట్లు జమ చేశామన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో మరో ఒక లక్ష మెట్రిక్ టన్నులు, ఏలూరు జిల్లాలో 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అదనంగా కొనుగోలు చేసేందుకు అనుమతులిస్తూ నిర్ణయించామన్నారు. అకాల వర్షాలను దృష్టిలో పెట్టుకుని రైతులకు 50 శాతం సబ్సిడీతో టార్పాలిన్లను అందించేలా చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఎమ్‌డి డాక్టర్ మనజీర్ జిలాని సామూన్, పశ్చిమ కలెక్టర్ చదలవాడ నాగరాణి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పరిశీలన

ఏలూరు సిటీ : సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి, ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణయ్య(చంటి)తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి మాట్లాడుతూ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు గండిపడగానే సరైన సమయంలో స్పందించకపోయివుంటే నీరు వృధా అయి ఏలూరు నగర ప్రజలు చాలా ఇబ్బందిపడే వారన్నారు. అయితే ఎంఎల్‌ఎ బడేటి చంటి సరైన సమయంలో స్పందించి ఇంజనీరింగ్ ఇన్ ఛీఫ్ నుంచి పురపాలక శాఖ మంత్రి వరకు ఈ సమస్యను తీసుకువెళ్లి గండిని పూడ్చేందుకు తీసుకున్న చర్యలు అభినందనీయమన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు శాశ్వత రక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రస్తుతం తలెత్తిన సమస్య పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది, సమస్యలు రాకుండా అన్ని విధాలా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు సంరక్షణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇది చాలా అత్యంత ముఖ్యమైన పని కాబట్టి ఏలూరు నగర భవిష్యత్‌కు సంబంధించి తాగునీటి అవసరాలు తీర్చే పని కాబట్టి ఈ విషయాన్ని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళతామని చెప్పారు. ట్యాంకు శాశ్వత రక్షణ చర్యలకు అవసరమైన నిధులు రాబట్టేందుకు ఎంఎల్‌ఎ బడేటి చంటి, తాను కృషిచేస్తామని మంత్రి తెలిపారు. ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణయ్య మాట్లాడుతూ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు శాశ్వత రక్షణ చర్యలకు ప్రభుత్వం ద్వారా నిధులు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి పార్థసారధిని కోరారు. నగరపాలక సంస్థలో నిధుల లేమి మూలంగా ప్రభుత్వం నిధులు కేటాయిస్తే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్‌ఎంఆర్.పెదబాబు, కమిషనర్ భాను ప్రతాప్, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

హెల్త్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించేందుకు కృషి : మంత్రి


మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న హెల్త్ ఆఫీసర్లు

ఏలూరు అర్బన్ : రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తానని రాష్ట్ర మంత్రి పార్థసారథి హామీ ఇచ్చారు. ముందుగా తమకు రావాల్సిన ఎనిమిది నెలల పెండింగ్ ఇన్సెంటివ్‌లతోపాటు ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్/కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు చేపట్టిన నిరవధిక సమ్మె 9వ రోజు మంగళవారం కలెక్టరేట్ వద్ద కొనసాగింది. జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న 400 మంది కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు కలెక్టరేట్ వద్దకు చేరుకుని అక్కడి నుంచి జిల్లా పరిషత్, ఆర్‌అండ్‌బి కార్యాలయం, ఫైర్ స్టేషన్ సెంటర్, కొత్త బస్టాండ్, జన్మభూమి పార్క్ మీదుగా తిరిగి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ప్లకార్డులు చేతబట్టి తమ సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేస్తూ ఈ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ వద్ద మోకాళ్లపై నిలబడి తమ నిరసన తెలియజేశారు. అనంతరం వైసిపి జిల్లా అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు, ఏలూరు పార్లమెంటు ఇన్‌ఛార్జి కారుమూరి సునీల్ కుమార్, మాజీ ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు, చింతలపూడి ఇన్‌ఛార్జి కంభంపాటి విజయరాజులు సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలియజేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు సొంగా సిద్దయ్య, జిల్లా కార్యదర్శి సురేంద్ర తమ సమస్యలను వారికి వివరించారు. ఈ సందర్భంగా వారు విషయాన్ని తమ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం వివిధ కార్యక్రమాల నిమిత్తం ఏలూరు కలెక్టరేట్‌కు వెళుతూ సమ్మె శిబిరాన్ని చూసి ఏలూరు ఎంపీ పుట్ట మహేష్, ఎంఎల్‌ఎ బడేటి చంటిలతో కలిసి సమ్మె శిబిరాన్ని సందర్శించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా న్యాయమైన కోర్కెల కోసం సమ్మె చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల వారి సమస్యలను తన దృష్టికి తీసుకురావడం జరిగిందని, ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టికి, సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కె.ప్రసన్న, కరుణ, రేష్మ, వెంకటకృష్ణ, రమేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వేతన బకాయిలివ్వాలి : వ్యకాస

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఉపాధి కూలీలకు బకాయి వేతనాలు వెంటనే ఇవ్వాలని కోరుతూ ఈనెల 20వ తేదీన పని బందను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుడెల్లి వెంకట్రావు పిలుపునిచ్చారు. ఆసంఘం ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని అప్పలరాజుగూడెంలో ఉపాధి కూలీలతో చర్చించారు. ఈ సందర్భంగా వారితో కలిసి ఈనెల 20న ఉపాధి కార్మికులు, ఉద్యోగ సంఘాలు, కార్మిక చట్టాలను పరిరక్షించాలని కోరుతూ జరిగే జాతీయ సమ్మెలో యావన్మంది పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో గత 13 వారాలుగా ఉపాధి కూలీలకు ఇవ్వాల్సిన డబ్బులు ప్రభుత్వం ఇవ్వకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. రూ.కోట్ల నిధులు విడుదల చేశామని ప్రభుత్వాలు చెబుతున్నప్పటికీ ఉపాధి కార్మికుల చేతికి డబ్బులు మాత్రం అందడం లేదని విమర్శించారు. ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి కూలీలకు రోజుకు వేతనం రూ.600లు ఇవ్వాలని, 200 రోజులు పని కల్పించాలని, పే స్లిప్పులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రామలక్ష్మి పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు అందజేత

ముసునూరు : మండలం విద్యాశాఖ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు అన్నారు. మండలంలోని 16 గ్రామాల్లో ఒకటి నుంచి పదవ తరగతి వరకు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు మొత్తం 17087 యూనిట్లు గాను 15047 పుస్తకాలు వచ్చాయన్నారు. ఆ పుస్తకాలను మండలంలోని సిఆర్సిలు, ఎంఆర్సిలు, ఎంఆర్సి సిబ్బంది సహాయంతో తరగతి వారీగా, సబ్జెక్టు వారీగా సపరేట్ చేసి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం విద్యార్థులకు పంపిణీ చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు.

ఉపాధి కల్పనకు కృషి చేయాలి

ప్రముఖ పారిశ్రామికవేత్తను కోరిన ఎంఎల్ఎ సొంగా రోషన్

చింతలపూడి : చింతలపూడి నియోజకవర్గంలో ఉపాధి కల్పనకు కృషిచేయాలని హైదరాబాద్లో ప్రముఖ పారిశ్రామికవేత్త, హెట్రో డ్రగ్స్ అధినేత, రాజ్యసభ సభ్యులైన పార్థసారధి రెడ్డిని చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ సొంగా రోషన్కుమార్ కోరారు. మంగళవారం హైదరాబాద్లో ఆయన్ని కలిసి చింతలపూడి ప్రాంతంలో పెట్టుబడులు పెట్టడానికి ఉన్న అవకాశాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్ట ప్రాంతమైన చింతలపూడిలో పెట్టుబడులు పెట్టి పరిశ్రమలు స్థాపించడం ద్వారా యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. చింతలపూడిలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయడం ద్వారా పారిశ్రామికవేత్తలకు కావలసిన అన్ని సదుపాయాలను సింగిల్ విండో ద్వారా కల్పించడానికి చంద్రబాబు నేతృత్వంలోని తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. చింతలపూడి నియోజకవర్గ పరిశ్రమ స్థాపనకు అనువైన ప్రాంతమని వివరించారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి టిడిపి నాయకులు జగ్గవరపు ముత్తారెడ్డి పాల్గొన్నారు.

క్రాంతి హైస్కూల్లో మెగా మెడికల్ క్యాంప్

కలిదిండి: మండలంలోని కోరుకొల్లు క్రాంతి హై స్కూల్లో మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. వర్రె జగన్నాథం చారిటబుల్ ట్రస్ట్, క్రాంతి హై స్కూల్ కరస్పాండెంట్, వాకర్స్ క్లబ్ అధ్యక్షులు చన్నంశెట్టి కృష్ణ, గుడివాడ లయన్స్ క్లబ్, విజయవాడ ఆను గ్రూప్ ఆఫ్ హాస్పటల్స్, క్రాంతి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన మెడికల్ క్యాంప్లో సుమారు 550 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వర్రె వెంకట సత్యనారాయణ, నీరజ (యుఎస్ఎ) దంపతుల ఆర్థిక సాయంతో ఉచితంగా కళ్లజోళ్లు, మందులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథి 204 కృష్ణా జిల్లా ఫౌండర్ గవర్నర్ సనక సుబ్బారావు క్యాంప్ ప్రారంభించారు. ఈ క్యాంప్లో ఆను హాస్పటల్ మేనేజర్ ఎస్.శివశంకర్, కార్డియాలజీ వైద్యులు జిఎ.ఖాన్, న్యూరాలజీ వైద్యులు సిహెచ్.నాగ ప్రియ, రుమటాలజీ వైద్యులు ఎ.లక్ష్మి, గైనకాలజీ వైద్యులు బి.సుజాత, ఆప్తమాలజీ వైద్యులు కె.షోటూరావు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ క్యాబినెట్ జాయింట్ సెక్రటరీ ఆళ్ల ప్రసాద్, కో ఆర్డినేటర్ గంట, కార్యదర్శి గొర్తి వెంకట కృష్ణకుమారి, ట్రెజరర్ చన్నంశెట్టి సుబ్బలక్ష్మి, ప్రిన్సిపల్ అజేష్ బాబు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సారా స్థావరాలపై విస్తృత దాడులు

ఎక్సైజ్ సిఐ మస్తాన్ రావు

నూజివీడు టౌన్ : సారారహిత సమాజమే లక్ష్యంగా విస్తృతమైన దాడులు నిర్వహిస్తున్నట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎ.మస్తానరావు తెలిపారు. నూజివీడులో ఆయన మంగళవారం మాట్లాడుతూ ఏడాది జనవరి నుంచి నవోదయం 2.0లో భాగంగా సారా స్థావరాలపై విస్తృత దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడులలో 140 కేసులు నమోదు చేసి, 167 మందిని అరెస్టు చేసినట్లు చెప్పారు. తయారుచేసిన సారా 3,624 లీటర్లు సీజ్ చేశామన్నారు. సారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన పులిసిన బెల్లపు ఊట 26 వేల లీటర్లు ధ్వంసం చేసినట్లు చెప్పారు. సారా తయారీదారులకు బెల్లం విక్రయించిన, సరఫరా చేసిన కేసులు పెడతామన్నారు. సారా క్రయవిక్రయాలు కొనసాగించిన, నిలువ ఉంచిన కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. నూజివీడు స్టేషన్ పరిధిలో 47 గ్రామాలను గుర్తించి విస్తృతమైన దాడులు నిర్వహించడం ద్వారా 36 గ్రామాలలో సారాను పూర్తిగా వదిలేసినట్లు తెలిపారు. మిగిలిన 11 గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ మాసంలోనే 29 కేసులు నమోదు చేసి 172 లీటర్ల నాటుసారా సీజ్ చేయడంతో పాటు 354 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసినట్లు చెప్పారు. సారా రహిత సమాజం కోసం తమ శాఖతోపాటు పోలీసు శాఖ, రెవెన్యూ, ఇతర ప్రభుత్వ శాఖల అధికారుల సమన్వయంతో కృషిచేస్తున్నట్లు చెప్పారు.

ఆక్వా రైతుల బరితెగింపు..!

పోల్రాజ్ కాలువ గట్టుకు గండి కొట్టిన వైనం

ముదినేపల్లి : మండలంలో ఆక్వా రైతులు బరితెగిస్తున్నారు. ఆక్వా రైతుల ఆగడాలు నానాటికి పెరిగిపోతున్నాయి. తాగునీటిని చౌర్యం చేసేందుకు పంట కాలువ ద్వారా మంచినీటి చెరువులకు వెళుతున్న నీటిని దారి మళ్లించేందుకు ప్రధాన పంట కాల్వ గట్టుకు గండి కొట్టారు. ఈ సంఘటన మండలంలోని గురజ వద్ద మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పోల్రాజ్ కెనాల్ నుంచి నియోజవర్గ శివారు గ్రామాలకు మంచినీటి చెరువులకు అధికారులు తాగునీటిని విడుదల చేశారు. ఆక్వాసాగు చేస్తున్న కొందరు రైతులు చేపల చెరువులకు నీరు మళ్లించేందుకుగాను గురజ వద్ద పోల్రాజ్ కాలువ గట్టుకు గండి కొడుతున్నారు. కాలువ గట్టుకు గండి కొట్టి తూములు ఏర్పాటు చేసే పనులు బెంగాల్కి చెందిన కూలీలతో చేపట్టారు. ఉదయం ఉపాధి పనులకు అటుగా వెళుతున్న కూలీలు ఈ విషయం గమనించి గురజ రైతులకు సమాచారం అందించారు. దీంతో పలువురు రైతులు, ఎన్డియే నాయకులు హుటాహుటిన ఘటనా స్థలాన్ని చేరుకుని కాలువ గండి తవ్వకం పనులను అడ్డుకొని నిలుపుదల చేయించారు. కాలువ గట్టుకు గండి కొట్టరాదంటూ ఆక్వారైతులను హెచ్చరించారు. దీంతో గండి తవ్వకం పనులు నిలిచిపోయాయి. కాలువ గట్టుపై తవ్విన గండిని పూడ్చి వేయించారు. సమాచారం తెలుసుకున్న జల వనరుల శాఖ ముదినేపల్లి సెక్షన్ ఎఇ వివికె.కుమార్ వెంటనే లస్కర్ని పంపించి గండి తవ్వకం పనులను నిలుపుదల చేయించారు. ఈ రీతిగా మండలంలోని ఆక్వా రైతులు లెక్కలేని తనంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అధికారులను సైతం లెక్కచేయడం లేదు.

బాలలు ఉన్నత విద్యను అభ్యసించాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

బాలలను ఉన్నత చదువులు చదివించడం వల్ల వ్యక్తిగత అభివృద్ధే కాక సమాజాభివృద్ధి జరుగుతుందని ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అన్నారు. మంగళవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ పెదపాడు మండలం కొత్తూరు గ్రామంలో అసంఘటిత కార్మికులకు అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ కార్మికుల పిల్లలు కార్మికులుగా ఉండరాదని తెలిపారు. బాలలు ఉన్నత విద్యను అభ్యసించే విధంగా చిన్ననాటి నుండే ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. గ్రామాలలో అక్కడక్కడ వెట్టిచాకిరి వంటి అసాంఘిక కార్యక్రమాలు ఇంకా కొనసాగుతున్నాయని, ఇటువంటి వాటిని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పి.రత్నరాజు, డిసిపిఒ సూర్య చక్రవేణి, అసిస్టెంటు ప్రాజెక్టు మేనేజర్ పి.శ్రీదేవి పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : కార్మిక దినోత్సవ వారోత్సవాల సందర్భంగా బుధవారం నూజివీడు మున్సిపల్ కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా నూజివీడు ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఒ.అనూష పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ కార్మికులు వాళ్లకు గల హక్కుల గురించి, చట్టాల గురించి తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ ప్రెసిడెంట్ ఎన్.రమేష్, సెక్రటరీ హరిబాబు, మాజీ బార్ ప్రెసిడెంట్ ఐ.సత్య ప్రకాష్, మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ నాగరాజు, పోలీసు సిబ్బంది, మున్సిపల్ వర్కర్స్ పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లపై.. అడిగేవారేరి..!

గ్రామాల్లో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న అక్రమ లేఅవుట్లు
ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
పట్టించుకోని అధికారులు
మోసపోతున్న కొనుగోలుదారులు


చినపాలపర్రులో లేఅవుట్ ఏర్పాటుకు పొలాన్ని పూడిక చేస్తున్న బడాబాబులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో అనధికార లేఅవుట్లు దర్శనమిస్తున్నాయి. ఎటువంటి కన్వర్షన్ ఫీజులు, డెవలప్మెంట్ ఛార్జీలు చెల్లించకుండా పచ్చని పంట పొలాలను పూడికచేసి ప్లాట్లుగా ఏర్పాటు చేసి సామాన్య, మధ్యతరగతి ప్రజలకు విక్రయిస్తున్నారు. కొనుగోలు చేసిన లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. 8 నెలల క్రితం వరకు ఒక మోస్తరుగా ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారం రెండు నెలల నుంచి మండలంలో జోరుగా సాగుతోంది. కొందరు బడాబాబులు ప్రభుత్వ అనుమతులు లేని భూములను పక్కా గృహాలకు ప్లాన్ చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. ప్రత్యేకించి కట్టడి చేయాల్సిన గ్రామకార్యదర్శులు, విఆర్ఒలు అటువైపు చూడటం లేదు. దీంతో అనధికారికంగా వెలసిన లేఅవుట్ల స్థలం కొనుగోలు చేసి, కట్టడాలు నిర్మించుకోవడానికి నిబంధనలు అడ్డురావడంతో కొనుగోలు చేసిన వ్యక్తులు నిరుత్సాహానికి గురవుతున్నారు. దీంతో రూ.లక్షల్లో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. మండలంలోని పలు గ్రామాల్లో అనధికార లేఅవుట్లు దర్శనమిస్తున్నాయి. మండల కేంద్రమైన ముదినేపల్లి పరిసర గ్రామాల్లో గత మూడు నెలలుగా పంచాయతీల్లో లేఅవుట్లు ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్నాయి. వీటిపై చర్యలు చేపట్టాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. దీంతో కొన్ని సందర్భాల్లో ఆ లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసినవారు ఇబ్బంది పడుతున్నారు. ముదినేపల్లి, చినపాలపర్రు, పెయ్యేరు, సింగరాయపాలెం, అల్లూరు, వణుదుర్రు, గురజ, పెదగొన్నూరు, పెదపాలపర్రు, శ్రీహరిపురం అల్లూరు, బొమ్మినంపాడు, ఈడేపల్లి, పెనుమల్లి తదితర పంచాయతీల్లో అక్రమ లేఅవుట్లే ఉన్నాయి. ఈ గ్రామాల్లో చిన్నచిన్న లేఅవుట్లు ఏర్పాటు చేసి సెంటు భూమి రూ.లక్షల్లో విక్రయాలు చేస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ఇక్కడ రూ.కోట్లలో రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగుతోంది. కొత్తవారు ఇక్కడ స్థిర నివాసం ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. మండలంలోని 32 గ్రామ పంచాయతీలకుగాను 20 గ్రామ పంచాయతీల్లో అనధికార లేఅవుట్లు ఉన్నాయి.

నిబంధనల జాడే లేదు..

నిబంధనల ప్రకారం లేఅవుట్లు వేసేటప్పుడు వ్యవసాయ భూమి అయితే వ్యవసాయేతర భూమిగా మార్చి ఉండాలి. గ్రామాల్లోనైతే రెవెన్యూ, పంచాయతీ అనుమతి పొందాలి. పట్టణ పరిధిలో అయితే టౌన్ప్లానింగ్ అధికారుల అనుమతి పొందాలి. తర్వాత పంచాయతీకి 10 శాతం భూమిని విడిచిపెట్టాలి. దాంతోపాటే 40 అడుగుల రహదారి కూడా ఏర్పాటు చేయాలి. ఆ తర్వాత లే అవుట్లో విద్యుత్, డ్రెయినేజీ వ్యవస్థను చూపించాలి. వీటిని ఎక్కడా పాటించడం లేదు. చాలామంది ఇవేమీ పట్టించుకోకుండా కొనుగోలు చేసి తర్వాత లబోదిబోమంటున్నారు. కొంతమంది మాత్రం దీనిపై ప్రశ్నిస్తే మీకెందుకు అన్ని అనుమతులు ఇప్పించే పూచీ మాది అంటూ మొదట స్థలం విక్రయించి ఆ తర్వాత ముఖం చాటేస్తున్నారు. దీంతో కొనుగోలుదారులు నష్టపోతున్నారు. ఇప్పటికే చినపాలపర్రు గ్రామ సమీపంలో ఏర్పాటుచేసిన లే అవుట్లో ప్లాట్లు కొనుగోలు చేసిన వ్యక్తులు ఇల్లు నిర్మించుకునే అవకాశం లేక లబోదిబోమంటూ గగ్గోలు పెడుతున్నారు. ప్రస్తుతం ఇదే పంచాయతీ పరిధిలో నూతనంగా అనధికార లేఅవుట్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం పొలాన్ని మట్టి పూడిక చేసే పనులు ట్రాక్టర్లతో జోరుగా సాగుతున్నాయి. అలాగే ముదినేపల్లి నుంచి పెయ్యేరు వెళ్లే రోడ్డులో భీమవరంకు చెందిన ఓ బడాబాబు అనధికార లేఅవుట్ ఏర్పాటుచేసి సెంటు భూమి రూ.లక్షల్లో విక్రయిస్తున్నాడు. ఈ తంతు అంతా ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు, రెవెన్యూ యంత్రాంగానికి తెలిసినప్పటికీ పట్టించుకున్న పాపానపోలేదు. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు స్పందించి మండలంలో అనధికారికంగా లేఅవుట్లు ఏర్పాటు చేసి విక్రయాలు చేస్తూ జనానికి కుచ్చుటోపి పెడుతున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.


ముదినేపల్లి-పెయ్యేరు మధ్య ఏర్పాటు చేసిన అనధికార లేఅవుట్

ధాన్యం మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

నష్టపోయిన రైతాంగానికి పరిహారం చెల్లించాలి
సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాస్

ఏలూరు అర్బన్ : రైతులు పండించిన ధాన్యం మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, అకాల వర్షాలకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈమేరకు వారు మంగళవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. టార్గెట్ పేరుతో కొనుగోలు సమయానికి రైతులను టార్గెట్ చేసి ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. జిల్లాలో దాదాపుగా నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయిందని లెక్కలు చెప్తున్న ప్రభుత్వం మరోపక్క కేవలం రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు లక్ష్యం నిర్ణయించడం అన్యాయమన్నారు. రైతుల ఆందోళనలు, ఉద్యమాల నేపథ్యంలో మరో 50 వేల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినా మిగిలిన ధాన్యాన్ని రైతులు ఏం చేసుకోవాలని వారు ప్రశ్నించారు. ప్రభుత్వం కొనుగోలు చేయగా మిగిలిన ధాన్యాన్ని రైతులు అమ్ముకునేందుకు ప్రయివేట్ వ్యాపారుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడే దుస్థితి వస్తుందని తెలిపారు. టార్గెట్కు మించి ధాన్యాన్ని కొనుగోలు చేయలేమని ప్రభుత్వం చెబుతూ లారీలను ఏర్పాటు చేయడంలో గాని, సంచులను ఇవ్వడంలో గాని తాత్సారం చేసిందని అన్నారు. దీంతో ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల రైతులు పండించిన పంట అటు కల్లాల్లోనూ, ఇటు కొనుగోలు కేంద్రాల్లో ఆరుబయట ఉండిపోయి, తడిచి రైతాంగం తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బాధ్యతారహిత్యంగా వ్యవహరించకుండా రైతులు పండించిన ధాన్యం మొత్తాన్ని కొనుగోలు చేసేందుకు కావలసిన చర్యలు తీసుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. జిల్లాలో కురిసిన భారీ వర్షాల వల్ల మామిడి, జీడు మామిడి, పామాయిల్, అరటి తదితర పంటలు దెబ్బతిన్నాయన్నారు. కొన్నిచోట్ల కరెంటు తీగలు తెగి పొలాల్లో పడి ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తెగిపడిన కరెంటు వైర్లను తొలగించేందుకు తగు చర్యలు తీసుకోవాలని, వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ముఖ్యమంత్రి నష్టపరిహారం వెంటనే చెల్లిస్తామని చేసిన ప్రకటన మాటలకే కాకుండా చేతల్లో చేసి చూపాలని కోరారు. పంటలు నష్టపోవడంలో గాని, ధాన్యం కొనుగోలు విషయంలో గానీ జిల్లాలో అత్యధికులుగా ఉన్న వ్యవసాయం చేస్తున్న కౌలు రైతులే బాధితులుగా ఉన్నారని, వారిని ఆదుకునేందుకు పంట నష్టపోయిన కౌలు రైతులను గుర్తించి పంటల బీమాను వర్తింపజేయాలని కోరారు. రైతులు పండించిన పంటను కల్లాల నుండే కొనుగోలు చేయాలని, కౌలు రైతుల పేర్లు ఈ క్రాప్లో నమోదు చేసి నష్టపరిహారం పంట పండించిన రైతుకే అందేలా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతాంగ సమస్యల పరిష్కారానికి తగు చర్యలు చేపట్టకపోతే పెద్ద ఎత్తున రైతులు ఆందోళన చేస్తారని వారు హెచ్చరించారు.

రహదారుల రూపురేఖలు మారాయ్ : ఎంపీ

ఏలూరు సిటీ : రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రహదారుల రూపురేఖలు మారాయని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్పష్టం చేశారు. ఏలూరు శాంతినగర్లోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జిల్లాస్థాయి అధికారులతో ఎంపీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఇంకా అభివృద్ధి చేయాల్సిన రహదారులకు అవసరమైన నిధుల మంజూరు నిమిత్తం అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనల నివేదిక సమర్పించాలని ఎంపీ అధికారులకు సూచించారు. రహదారుల అభివృద్ధి పనులను వేగవంతం చేయడంలో సమర్థవంతంగా ఆర్ అండ్ బి శాఖ అధికారులు పనిచేశారని ఎంపీ అభినందించారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపేందుకు అధికారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని సీడాప్ అధికారులకు సూచించారు. అధికారులు సమర్థవంతంగా పనిచేస్తేనే తనతో పాటు ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని ఎంపీ తెలిపారు. అధికారులతో సమీక్ష సమావేశం అనంతరం ఎంపీ ఆయా గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కొయ్యలగూడెం తహశీల్దార్ సక్రమంగా పనిచేయడం లేదని, పని నిమిత్తం వెళ్తే డబ్బులు డిమాండ్ చేస్తున్నారని పలు రైతులు ఎంపీకు ఫిర్యాదు చేశారు. సదరు తహశీల్దార్ సక్రమంగా పనిచేయకపోతే ఇంటికి వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. సమీక్ష సమావేశానికి ఆర్అండ్బి డిప్యూటీ ఇఇలు ఎం.గోవింద మోహన్, సిహెచ్.విజయ్ శేఖర్, ఇఇ వైవి.కిషోర్బాబు, ఎస్ఇ పి.భరతరత్నం, పంచాయతీరాజ్ ఎస్ఇ ఎంవి.రమణమూర్తి, నీటి యజమాన్య సంస్థ జిల్లా పీడీ కె.వెంకట సుబ్బారావు, భూగర్భ జలశాఖ ఇన్ఛార్జి డిడి సిహెచ్.వెంకటరావు, సీడాప్ జెడిఎం కె.పార్థసారథి, ఎపిఎస్-ఎస్డిసి డిఎస్డిఒ ఎన్.జితేంద్ర పాల్గొన్నారు.

కొనసాగిన వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి - కలిదిండి

వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో హిందీ వ్యాకరణం పై నజరున్నిసాచే శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు శాఖ గ్రంథాలయాధికారి జె.రమేష్ బాబు తెలిపారు. పుస్తక పఠనం, పుస్తక సమీక్ష నిర్వహించారు. పలు పాఠశాలల విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషిచేయాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని అంగన్వాడీ సూపర్వైజర్ లక్ష్మీ దేవమ్మ సిబ్బందికి ఆదేశించారు. మంగళవారం జీలుగుమిల్లి అంగన్వాడీ సెంటర్లో కిశోర బాలిక వికాసంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. అసభ్యకరంగా ప్రవర్తించే పురుషుల పట్ల బాలికలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండల వ్యాప్తంగా మే 2 నుంచి జూన్ 10 వరకు కిషోర వికాసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా యుక్త వయసు ఉన్న బాలికలను ఒక చోటికి తీసుకువచ్చి ఆరు రకాల అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు నాగమణి, సరళ, అరుణాంబ, ఆరోగ్య సిబ్బంది, మహిళా పోలీసులు, వెలుగు విఒఎలు పాల్గొన్నారు.

ఏలూరు సిటీ : ఏలూరు పరిధిలో ఫస్ట్ సెక్టార్ యాదవ నగర్ అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం కిషోర్ బాలిక వికాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిడిపిఒ విజయలక్ష్మి కిషోర బాలికలకు రుతుక్రమంలో పాటించవలసిన పరిశుభ్రత, లైంగిక విద్య గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ మంగ, హెచ్ఎం ఆదిలక్ష్మి, జిఎంఎస్కె.రేవతి, అంగన్వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

పలుచోట్ల కిశోర బాలిక వికాసంపై అవగాహన


ఏలూరు సిటీలో..

ఏలూరు: ఆదివారం పేట పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో కిషోర్ బాలిక వికాసంలో భాగంగా కిశోర బాలికలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐసిడిఎస్ ఏలూరు అర్బన్ ప్రాజెక్ట్ సిడిపిఒ విజయలక్ష్మి మాట్లాడుతూ కిషోర్ బాలికలకు రుతుస్రావంలో వచ్చే సమస్యలు, వాటి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆ సమయంలో బాలికలు తీసుకోవలసిన శుభ్రత, సానిటరీ నాప్కిన్స్ వినియోగం, వాటిని భద్రపరిచే విషయాలపై అవగాహన కల్పించారు. పిల్లల ఆహారం పట్ల జాగ్రత్తలు, మంచి పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎం.మౌనిక, మహిళా కార్యదర్శులు కె.నాగమణి, ఎం.సంధ్యారాణి, అంగన్వాడీ కార్యకర్తలు పి.హైమావతి, అన్నపూర్ణ, స్వర్ణలత, షమీమా బేగం, వెంకటరమణ, హేమలత, విజయలక్ష్మి పాల్గొన్నారు.

గురజ సర్ప్లస్ ఎస్కేప్ గేటు(వైరు) మూసివేత

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

జల వనరుల శాఖ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని గురజ సర్ప్లస్ ఎస్కేప్ పోల్రాజ్ కాలువ అత్యవసర గేటు(వైరు)ను మంగళవారం మూసివేశారు. మండలంలో జరుగుతున్న తాగునీటి చౌర్యంపై ప్రజాశక్తిలో సోమవారం చేపల చెరువులకు గేట్లు ఎత్తేశారు అనే శీర్షికతో వార్త వెలువడిన విషయం పాఠకులకు విధితమే. ఈ వార్తపై స్పందించిన సంబంధిత శాఖ అధికారులు పోల్రాజ్ పంట కాలువ గురజ సర్ప్లస్ ఎస్కేప్ (వైరు నుంచి) పోల్రాజ్ మురుగు కాలువ ద్వారా చేపల చెరువులకు వెళుతున్న నీటికి అడ్డుకట్ట వేశారు. మండల జలవనరుల శాఖ ఎఇ కిషోర్ ఆదేశాలతో లస్కర్లు పంట కాలవ నుంచి చేపల చెరువులకు వెళుతున్న కాల్వ షట్టర్ను కిందికి దింపి వేశారు. దీంతో చేపల చెరువులకు వెళుతున్న నీరు బంద్అయింది.


షట్టర్ దింపేసిన అధికారులు


కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.పోశమ్మ

ప్రజాశక్తి - టి.నరసాపురం

కార్మిక చట్టాలను ప్రభుత్వం పటిష్టంగా అమలు చేయాలని ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.పోశమ్మ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో ఆశావర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం సిఐటియు జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆశ వర్కర్స్ యూనియన్ జాతీయ నాయకురాలు రంజినా నీరుల్లా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన జరుగుతున్న అఖిలభారత కార్మికుల సమ్మెకు ఎపి ఆశావర్కర్స్ యూనియన్ పాల్గొంటుందని, యావన్మంది ఆశాలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి మురళీ, సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.

కుక్కునూరు: కార్మికుల హక్కులకు వ్యతిరేకంగా తీసుకువస్తున్న లేబర్ కోడ్స్కు వ్యతిరేకంగా మే 20వ తేదీ జరిగే సమ్మెలో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ పిలుపునిచ్చారు. మంగళవారం కుక్కునూరు, అమరవరం పిహెచ్సి ఆశాలు మెడికల్ ఆఫీసర్స్కి సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె నోటీస్ ఇచ్చారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం పెట్టుబడుదారుల సౌలభ్యం కోసం నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువస్తు కార్మికులకు అన్యాయం చేస్తుందని విమర్శించారు. ఈ సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రంశెట్టి నాగేంద్రరావు, ఆశా యూనియన్ అధ్యక్షులు, కార్యదర్శి కాక బాపనమ్మ, కారం రాజేశ్వరి, ఆశాలు బురం శ్రావణి, ఆదెమ్మ, రమణ, పద్మ, తులసి, మునెమ్మ, సరోజిని, సుస్మిత పాల్గొన్నారు.


టి.నరసాపురం : మాట్లాడుతున్న పోచమ్మ

ముసునూరు : ఈనెల 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఆశావర్కర్లు వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. మంగళవారం మండల కేంద్రమైన ముసునూరు, మండలంలోని రమణక్కపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆశాలు, అంగన్వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో ఆయా ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యాధికారులకు సమ్మె చేసేందుకు వెసులుబాటు కల్పించేందుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు జి.రాజు మాట్లాడుతూ ఆశలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ పథకాలు వర్తింప చేయాలని, కార్మిక చట్టాలను రద్దు చేయాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, పలు అంశాలపై ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ కోరారు. ఈ కార్యక్రమంలో ముసునూరు మండల సిఐటియు నాయకులు కొడవలి శ్రీనివాస్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

బహిర్భూమికి వెళ్లిన వృద్ధుడు గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో ఘటనా స్థలంలోనే మృతిచెందిన ఘటన ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఏలూరు రైల్వే ఎస్ఐ సైమన్ తెలిపిన వివరాల ప్రకారం కృష్ణాజిల్లా బాపులపాడు మండలం కోడూరుపాడు గ్రామానికి చెందిన చిట్టి బొమ్మల ఏడుకొండలు(58) స్థానికంగా భార్య, పిల్లలతో కలిసి జీవిస్తున్నాడు. స్వతహాగా వృద్ధుడు కావడంతో ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈక్రమంలో మంగళవారం మధ్యాహ్నం సమయంలో కోడూరుపాడు రైల్వే పట్టాలపై బహిర్భూమికి వెళ్తున్నాడు. అదే సమయంలో వేగంగా వచ్చిన గుర్తుతెలియని రైలు బండి అతన్ని బలంగా ఢీకొట్టింది. అతను అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. రైల్వే ఎస్ఐ సైమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెల్లని చెక్కు కేసులో ఇరువురికి జైలు శిక్ష : జరిమానా

నూజివీడు టౌన్ : చెల్లని చెక్కు కేసులో నూజివీడుకు చెందిన కందుల దయాసాగర్కు ఆరు నెలల జైలు శిక్ష, రూ.7 లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి మంగళవారం తీర్పునిచ్చారు. పట్టణానికి చెందిన పి.హరీష్ 2019 డిసెంబర్ 29న దయాసాగర్కు ఇచ్చిన ఐదు లక్షల అప్పుకు చెల్లని చెక్కు ఇవ్వడంతో హరీష్ కోర్టును ఆశ్రయించారు. విచారణ అనంతరం మెజిస్ట్రేట్ కృష్ణమూర్తి తీర్పునిచ్చారు. బాకీ చెల్లించే నిమిత్తం ఇచ్చిన చెక్కు చెల్లని నేరానికి నూజివీడుకు చెందిన బొల్లికర్ల పుల్లారావుకు 6 నెలల జైలు శిక్ష, రూ.4 లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి తీర్పునిచ్చారు. పట్టణానికి చెందిన బెజవాడ రామారావు 2016 అక్టోబర్ 16న పుల్లారావుకు 2 లక్షలు అప్పు ఇవ్వగా, బాకీ చెల్లించేందుకు రూ.3.60 లక్షల చెక్కు ఇచ్చారు. చెక్కు చెల్లకపోవడంతో బాధితుడు కోర్టును ఆశ్రయించారు. విచారణ అనంతరం మెజిస్ట్రేట్ తీర్పునిచ్చారు.

ఫోరెన్సిక్ విభాగంపై అవగాహన

ఏలూరు స్పోర్ట్స్ : గ్రేవ్ కేసులను చేదించడంలో ఫోరెన్సిక్ విభాగం సహాయత పోలీసులకు ఎంతగానో దోహదపడుతుందని జిల్లా ఎస్పి ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం ఒక్కరోజు ఫోరెన్సిక్ వర్క్షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఫోరెన్సిక్ నిపుణుల బృందం జిల్లావ్యాప్తంగా ఉన్న పోలీసు అధికారులకు, సిబ్బందికి ఫోరెన్సీ విభాగంపై పూర్తిస్థాయి అవగాహన కల్పించారు. అంతేకాకుండా వారి సందేహాలను కూడా నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ ఆధారాలు లేని కేసులు చేధించడంలో ఫోరెన్సిక్ ఇచ్చే ఆధారాలను ఆధారంగా చేసుకుని కేసులో పురోగతి సాధిస్తామని ఆయన స్పష్టం చేశారు. జిల్లా అదనపు ఎస్పి నక్క సూర్యచంద్రరావు, ఎ.ఆరాధన, ఎస్పి శేఖర్, డిఎస్పి శ్రావణ్ కుమార్, పలువురు డిఎస్పిలు పాల్గొన్నారు.